

కార్తీకశోభ



పాలసముద్రం మండలం శ్రీబొమ్మరాజుపురంలో బాలగురునాథీశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం





బాలగురునాథీశ్వరాలయంలో ఉసిరి చెట్టు వద్ద, చౌడేపల్లె మృత్యుంజయేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మణికంఠేశ్వరాలయంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు



చిత్తూరు గిరింపేటలోని చిదంబరేశ్వరాలయంలో భక్తుల సందడి

జిల్లాలోని శివాలయాలన్నీ ప్రత్యేక పూజలు, అభిషేకాలతో సందడిగా మారాయి.కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. చిత్తూరులోని ఇరువారం నాగేంద్రస్వామి, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయం, నీవానది కాశీ విశ్వేశ్వరాలయం, కట్టమంచి కుళందేశ్వర ఆలయం, పాలసముద్రం మండలం రాచపాళ్యంలోని పంచమూర్తుల ఏకశిలా విగ్రహం, పుంగనూరు మండలం నెక్కొంది కొండపై చోళ రాజులు నిర్మించిన అగస్త్యేశ్వరాలయం,యాదమరిలోని ఏకాంబరేశ్వర కామాక్షీ దేవి ఆలయం, బంగారుపాళ్యం మండలం మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర ఆలయం,సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపం దుర్గంకొండలోని గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం,రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయం,చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

విమానాశ్రయాలకు దీటుగా
రైల్వే స్టేషన్ల అభివృద్ధి

- స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ తదితరులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో విమానాశ్రయాలకు దీటుగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో సోమవారం నూతన భవనాల నమూనాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన రైల్వే స్టేషన్లకు నిధులు కేటాయించిందన్నారు. మరో 50 ఏళ్ల వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. రైల్వే ప్రాజెక్టుల పనితీరుపై చర్చించినట్లు సీఎం రమేష్ తెలిపారు. రైల్వే స్టేషన్లలో రైళ్ల అవసరాలకు అనుగుణంగా మల్టీలెవల్ ప్లాట్‌ఫారాలు, రైలు మార్గాల్లోని అత్యవసర ప్రదేశాల్లో అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. సభ్యులు లక్ష్మణ్, భోలేసింగ్, మహరాజ్‌తో పాటు పలువురు సభ్యులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్, సీతః సూర్యనారాయణ, సీపీవో సత్యప్రకాష్, డీఆర్ఎం విజయకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌కు వేళయ్యింది!



చిత్తూరు సెంట్రల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ నోటిఫికేషన్‌ను బుధవారం రాష్ట్రప్రభుత్వం విడుదల చేయనుంది. టెట్ ఫలితాలు సోమవారం వచ్చిన క్రమంలో డీఎస్సీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1473 ఖాళీలను అధికారులు గుర్తించారు. హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లను కేటగిరీలవారీగా, ప్రాథమిక పాఠశాలల్లో పోస్టులన్నింటినీ ఎస్జీటీలుగా చూపించారు. స్కూల్ అసిస్టెంట్లను, వ్యాయామ ఉపాధ్యాయులను, సెంకడరీ గ్రేడ్ టీచర్లను, భాషా పండితులను విభాగాలుగా ఖాళీలెన్ని వున్నాయో గుర్తించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన గుర్తించి, వివరాలను విద్యాశాఖ డైరెక్టరేట్‌కు పంపారు. నోటిఫికేషన్ వెలువడడానికి ముందు రోస్టర్‌ను నిర్ధారించే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1473 ఉపాధ్యాయ ఖాళీలు

ఖాళీల భర్తీతో తగ్గనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు

మొత్తం ఖాళీ పోస్టులు

పోస్టు	జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు	మున్సిపల్ స్కూళ్లు	మొత్తం
ఎస్జీటీ	820	110	930
ఎస్ఏ హిందీ	12	10	22
ఎస్ఏ ఇంగ్లీష్	100	5	105
ఎస్ఏ మ్యాథ్స్	28	5	33
ఎస్ఏ ఫిజిక్స్	28	1	29
ఎస్ఏ బయాలజి	58	10	68
ఎస్ఏ సోషల్	120	12	132
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	86	1	87
స్కూల్ అసిస్టెంట్(ఇతర)	45	22	47
మొత్తం	1297	176	1473

విడుదలైన టెట్ ఫలితాలు

ఇటీవల నిర్వహించిన టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) ఫలితాలను రాష్ట్రప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. జిల్లాలో అక్టోబరు 3న ప్రారంభమైన టెట్ పరీక్షలు అక్టోబరు 21న ముగిశాయి. జిల్లాలోని నాలుగు కేంద్రాలతో పాటు చెన్నైలోని రెండు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, ఇతర ప్రాంతాలకు చెందిన 6876 మంది పరీక్షలు రాశారు. ఇందులో 5893 మంది అభ్యర్థులు చిత్తూరు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో, 983 మంది అభ్యర్థులు చెన్నైలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు రాశారు. తుది కీ ఇటీవలే విడుదలైంది. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాయడానికి అర్హులవుతారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1473 పోస్టులు భర్తీ కానున్నాయి. కాగా డీఎస్సీ పరీక్షలు 2025 ఫిబ్రవరిలో నిర్వహించే వీలుంది. టీచర్ ఖాళీల భర్తీతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య తగ్గే అవకాశాలు ఉన్నాయి.

● డీఎస్సీపై ఆశలతో శిక్షణ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించకపోవడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు నిరాశానిస్పృహల్లో కూరుకుపోయారు.కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటన నిర్ణయంతో పరీక్షల కోసం రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధిత స్టడీ సర్కిళ్ల ద్వారా ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇస్తోంది.వేలాది మంది విద్యార్థులు పలు స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.





అర్జీలను తీసుకుంటున్న జేసీ విద్యాధరి, బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పట్టాదార్ పాసుపుస్తకాలివ్వండి

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో బాధితుల వేడుకోలు

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలో ఉన్న భూములకు పట్టాదార్ పాసుపుస్తకాలను మంజూరు చేయాలని గుడిపాల మండలం నారగల్లు ఎస్టీకాలనీ వాసులు వేడుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జేసీ విద్యాధరికి అర్జీ సమర్పించారు. 16 కుటుంబాలకు చెందిన తాము 30 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో రాళ్లు, రప్పలను తొలగించి వ్యవసాయం చేసుకుంటున్నామని చెప్పారు. ఇందులో కొంత భూమిని అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని కోరారు. అలాగే పెద్ద పంజాణి మండలం శంకరాయలపేట పంచాయతీ నిడివిగుంట లెక్కదాఖలాలో 2.56 ఎకరాల భూమి తన అనుభవంలో ఉందని 2009నుంచి పట్టాదార్ పాసుపుస్తకం ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నాగరాజాచారి వాపోయారు. మొత్తం 171 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకే 131 అర్జీలు ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను జేసీతోపాటు పలువురు అధికారులు స్వీకరించారు.

● ఏ జీవనాధారం లేని తమకు గిరిజన కార్పొరేషన్ నుంచి రుణాలను మంజూరు చేయాలని కార్వేటినగరం మండలం కేశవకుప్పం ఎస్టీకాలనీకి చెందిన ఎస్టీలు కోరారు.

● భర్త చనిపోవడంతో జీవనాధారం కష్టమవుతోందని, తనకు వృద్ధాప్య పింఛన్‌ను మంజూరు చేయాలని బంగారుపాళ్యం మండలం జీకేవీ పూరుకు చెందిన లక్ష్మమ్మ కోరారు.

● తన తాత పేరుపై ఉన్న భూమిలో అర్థభాగంలో తనకు వాటా ఇప్పించి పట్టాదార్‌పాసుపుస్తకాన్ని ఇవ్వాలని చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన హరి కోరారు. అలాగే ఇదే మండలం కొత్తయిండ్లు గ్రామానికి చెందిన తనకు సర్వే నెంబరు 315-3లో 4.94 ఎకరాల భూమి ఉందని, 1బీని మంజూరు చేయాలని కదిరప్ప కోరారు.

పోలీసు కార్యాలయానికి 22 అర్జీలు

పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 22 అర్జీలు అందాయి. వీటిల్లో చీటింగ్‌పై ఒకటి, కుటుంబ తగాదాలు, వేధింపులపై మూడు చొప్పున, ఇంటి తగాదాలపై రెండు, భూ తగాదాలపై తొమ్మిది, డబ్బు తగాదాలు, ఆస్తి తగాదాలపై రెండు చొప్పున ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను ఎస్పీ మణికంఠ స్వీకరించారు.

వరసిద్ధుడి ఆలయానికి
రూ.23.54 లక్షల ఆదాయం



టెండర్లు నిర్వహిస్తున్న ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శనివారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ.23,54,759 ఆదాయం లభించింది. ఆలయ ఈవో కార్యాలయ భవనం వద్ద బహిరంగ వేలం, సీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించినట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. భక్తుల పాదరక్షలను భద్రపరిచే హక్కును ఏడాది కాల పరిమితితో సీల్డ్ టెండర్ దారుడు హెచ్చుగా కోడ్ చేయడంతో అతనికి హక్కు దక్కినట్లు ఈవో తెలిపారు. కల్యాణ కట్ట వద్ద బంకు నిర్వహణకు, గోమయం సేకరించే లైసెన్స్‌కు ఎవ్వరూ పాల్గొన లేదన్నారు. త్వరలో వీటికి వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపే టీటీడీ బోర్డు ప్రమాణ స్వీకారం

నేడు తిరుమలకు రానున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన టీటీడీ ధర్మకర్తల మండలి బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుంది. చైర్మన్‌గా బీఆర్ నాయుడుతో పాటు 17 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది. దీనికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. కాగా, చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని ఆయన సొంతూరు దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు తిరుమలలోని గాయత్రి అతిథిగృహానికి చేరుకుంటారు.

ఏపీవోగా మురుగేష్

పెద్దపంజాణి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ఏపీఓగా మురుగే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న చిన్నరెడ్డెమ్మ బదిలీపై వెళ్లడంతో గంగవరం మండలం నుంచి మురుగేష్ బదిలీపై వచ్చారు.



త్వరలో వయోజన విద్య

పెద్దపంజాణి, నవంబరు 4:(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక బృందాలలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి వయోజన విద్యాకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

జీతాల కోసం 108 సిబ్బంది నిరసన


వి.కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో 108 అంబులెన్స్ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 108 నిర్వహణ బాధ్యతలు తీసుకున్న అరబిందో యాజమాన్యం గత నాలుగేళ్లలో ఏన్నడూ ఒక్కసారైనా సమయానికి జీతాలు ఇచ్చిన చరిత్ర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వారంలోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని వి.కోట 108 ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు శంకర్, ఇతర కమిటీ సభ్యులు తెలిపారు.



యోగి నారాయణ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం చెరువు కట్ట వద్ద కాపు, బలిజ కులస్థుల దైవం యోగి నారాయణ (కైవారం తాతయ్య) విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. కైవారం ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ భూమిపూజ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం చేతులమీదుగా జరిగింది. వారు మాట్లాడుతూ కాపు, బలిజ కుల దైవమైన యోగి నారాయణ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం తరపున తగు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బాబునగర్‌కు చెందిన కొంతమంది దళితులు అక్కడికి చేరుకుని ఇదే చోట అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేయడంతో కొద్దిసేపు వివాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇవ్వడంతో వారు వెనక్కు తగ్గారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, జనసేన నాయకుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.





రక్తదానం పుణ్యకార్యం

కుప్పం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడమనేది పుణ్యకార్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలో సోమవారం రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ విజయోత్సవ సభ జరిగింది. బ్లడ్ డోనర్స్ ప్రతినిధి నవీన్ మాట్లాడుతూ దాతల సహకారంతో మూడు వేల మందికి రక్తదానం చేయడమనే లక్ష్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ వెంకటేశ్, జనసేన కుప్పం కో ఆర్డినేటర్ నరేశ్, బ్లడ్ డోనర్స్ ప్రతినిధులు, పీఈఎస్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంబేడ్కర్ బొమ్మ తొలగింపుపై వాగ్వాదం


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసార్లపల్లె గ్రామంలో కొందరు రాతిబండపై రూపొందించబడి వున్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్ బొమ్మను సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగించడంపై వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వస్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఎవరికీ అనుమతి లేదని అధికారులు అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం ఏర్పడింది. తహసీల్దార్ మాధవరాజు, ఎస్ఐ పరశురాముడు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేసిన వారితో మాట్లాడారు. ప్రభుత్వస్థలంలో ఏర్పాటు చేయకూడదని వారికి సూచించారు. సమస్య ఉధృతం చేయకుండా సహకరించాలని కోరారు.





అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


టీడీపీ నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

వి.కోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం వి.కోటలోని పీఎంఆర్ కళ్యాణ మండపంలో మండల పరిధి యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐదు నెలలుగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఏవిధంగా అందుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. మండల పరిధిలో ఇటీవల మంజూరు చేసిన సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసి అగ్రగామిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు సుబ్బన్న, చౌడప్ప, రాంబాబు, ధీరజ్, విశ్వనాథ్, రుహుల్లా, శివకుమారి, జనార్ధన్ రెడ్డి, నారాయణస్వామి, సతీష్, అమర పాల్గొన్నారు.



అత్తికుప్పంలో సత్యసాయి సాధన శిబిరం

రామకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అత్తికుప్పంలోని దత్తమినీంద్రాశ్రమంలో సాధన శిబిరం నిర్వహించారు. తొలుత సత్యసాయి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన సాధన శిబిరంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ భక్తులకు ఓంకారం, సుప్రభాతం, నగరసంకీర్తన, నామసంకీర్తన, ధ్యానం, జ్యోతిధ్యానం, సత్సంగం, సాయి సాహిత్య పఠనంపై అవగాహన కల్పించారు. సత్యసాయి సేవా సమితి రాష్ట్ర సమన్వయకర్తలు రాఘవరావు, కస్తూరీ, భాస్కర్ ప్రసాద్, జిల్లా ప్రముఖులు నాగేంద్రకుమార్, చంద్రశేఖర్, హేమలత, సాయిరోహిత, గోపీనాథ్, శేషనారాయణ, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.





ఏబీపీఎంకు సన్మానం



సదుం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పుంగనూరు డివిజన్ పోస్టల్ మెయిల్స్ రెడ్డివారిపల్లె ఏబీపీఎం వెంకటరమణ సోమవారం పదవీ విరమణ చేశారు. సదుం పోస్టల్ కార్యాలయంలో ఆయనకు సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. శాలువలతో సన్మానించి ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో జీడీఎస్ నాయకులు నారాయణ రెడ్డి, పోస్టల్ సిబ్బంది, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): నేతిగుట్లపల్లె అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసి 8మందిని అదుపులోకి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. వారి నుంచి రూ. 18500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఏనుగుల దాడుల నుంచి కాపాడాలి

పలమనేరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా రైతు సంఘం అధ్యక్షకార్యదర్శులు ఉమాపతినాయుడు, వెంకటరామిరెడ్డి డీఎ్‌ఫవోకు భవానికి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాదాపు 100 ఏనుగులు అటవీ సరిహద్దు పొలాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేయడంతోపాటు పాడిపశువులను కూడా చంపి వేస్తున్నాయని వారు డీఎ్‌ఫవోకు విన్నవించుకొన్నారు. ఇప్పటికే అటవీ సరిహద్దు గ్రామాల్లో రైతులు కోతులు, అడవి పందులు, దుప్పుల నుంచి పంటలను కాపాడుకోలేకపోతున్నారని, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు కోతకొచ్చే దశలో తమ కళ్లముందే ఏనుగులు తినేస్తుంటే రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. అంతేకాక రైతులకు ప్రభుత్వం ఇస్తున్న పంట నష్టపరిహారాలు కూడా నామమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన శాంతారాం



కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలిలో తనకు అవకాశం కల్పించినందుకు పాలకమండలి సభ్యుడు వైద్యం శాంతారాం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో సోమవారం ఆయన కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రిని కలిసి సత్కరించారు. ట్రస్టు బోర్డు పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు

పలమనేరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీ కార్యదర్శికి రైతులు వినతి పత్రం అందజేశారు. సోమవారం రైతు సంఘం నాయకులు ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇస్తామని కూటమిప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ హామీని నెరవేర్చాలని వారు కోరారు.

టీడీపీ కార్యకర్తలకు బీమా సౌకర్యం

పుంగనూరు రూరల్, నవంబరు4: తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపుతో పాటు బీమా సౌకర్యం ఉన్నట్లు టీడీపీ మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏటవాకిలి గ్రామ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకుంటే గుర్తింపుతోపాటు రూ. 5లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వం పొందిన కార్యకర్త మృతి చెందితే అంత్యక్రియ ఖర్చులకు రూ. 10వేలు ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

పుంగనూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గురురాజారావు డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక విశ్రాంత భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఏ బకాయిలు, నూతన డీఏ, పీఆర్సీ ప్రకటించాలన్నారు. అలాగే పింఛన్‌ కమిటేషన్‌ రికవరీలు 12 సంవత్సరాలకే ఇవ్వాల్సివుందన్నారు. సమావేశంలో నాయకులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, భరత్‌భూషన్‌, కేశవరెడ్డి, చంద్రశేఖర్‌, సిద్దలింగం, సుబ్రహ్మణ్యం, ద్వారకమ్మ, గంగులమ్మ, చలపతి, రమేశ్‌, వరదరాజులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

పుంగనూరు, నవంబరు4: వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం ముడిపాపనపల్లె పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ వైద్యులు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సివుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్‌ రాము, డాక్టర్‌ సల్మాబేగం, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక సందడి



పలమనేరు, రామకుప్పంలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో దీపాలు పెడుతున్న మహిళలు, పుంగనూరులో ఊరేగుతున్న దేవతామూర్తులు,

పలమనేరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం తొలివారం కావడంతో స్వామి, అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలోనే మహిళలు వచ్చి కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

రామకుప్పం : అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక సోమవారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాత్రి భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

శాంతిపురం : తుమ్మిశిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు.

చౌడేపల్లె : స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రొంపిచెర్ల : పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరస్వామి, రొంపిచెర్లలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో, మోటుమల్లెల కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు నోములు నోచుకున్నారు.

గుడుపల్లె: మల్లప్ప కొండలో వెలిసిన మల్లేశ్వరుడి ఆలయం, కాడేపల్లెలోని నాగనాగదీశ్వరుడు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, స్వామి వార్లకు అర్చనలు చేయించి మొక్కుకున్నారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలగించి స్వామి శివనామ పారాయణం చేసి మొక్కులు తీర్చుకొన్నారు.

పుంగనూరు రూరల్ : కార్తీక మాసం పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరులు, బసవేశ్వరస్వామి, గణపతి, వీరభద్రస్వామి, భద్రకాళీదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలను మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సోమల : దుర్గంకొండలో అర్చకులు స్వామివారికి అభిషేకపూజలు, అర్చనలు జరిపారు. పలువురికి శివమాలాధరణ నిర్వహించారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం, కందూరు, తమ్మినాయనపల్లె, వల్లిగట్ల, రాశెట్టివారిపల్లె, పగడాలవారిపల్లె , మల్లేశ్వరపురం, రెడ్డివారిపల్లె, పెద్దఉప్పరపల్లె, ఇరికిపెంట మల్లేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు.

రామకుప్పం : అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం కార్తీక సోమవారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాత్రి భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎంపీ దగ్గుమళ్ల



వ్యవసాయ, ఉద్యానశాఖ తీరుపై అధికారుల ద్వారా తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్సీలు

రామకుప్పం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు కోరారు. సోమవారం రామకుప్పంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని, మండలంలో నెలకొన్న సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై వారు సమీక్షించారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు మరమ్మతు, పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ, మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. దీనిపై వారు స్పందిస్తూ కుప్పం నియోజకవర్గంలో అన్ని గ్రామాలను ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. గ్రామాల్లో సమస్య పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎటువంటి నిధుల కొరత లేదన్నారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గోకులం షెడ్లు మంజూరై, వాటి నిర్మాణానికి స్థలాలు లేని ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు గ్రామకంఠంలో స్థలాలను కేటాయించే అవకాశాలను పరిశీలించాలని వారు అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు అందే సంక్షేమ ఫలాలు, వ్యవసాయ పరికరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నేతల సమక్షంలో పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ వైస్‌చైర్మెన్‌ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, తహసీల్దారు బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నైపుణ్య గణన సర్వే



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ పరిధిలో మంగళవారం నుంచి నైపుణ్య గణన (స్కిల్‌ సెన్సెస్‌) సర్వే చేపట్టనున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ వి.శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక సంఘం ఉద్యోగులు, సిబ్బందితో ఆయన సోమవారం ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 30వ తేదీదాకా నైపుణ్య గణన సర్వే చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ తిరిగి 15-59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని, ఉద్యోగులు, నిరుద్యోగులైన ప్రతిఒక్కరినీ ఈ సర్వేద్వారా గుర్తించాలన్నారు.

రొంపిచెర్ల : వృత్తి నైపుణ్యతకు అర్హులను గుర్తించాలని ఎంపీడీవో హరిబాబు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి వృత్తి నైపుణ్యతపై శిక్షణ ఇచ్చారు. మండలంలో టైలరింగ్‌, మేస్త్రీ, సాఫ్ట్‌వేర్‌, కంప్యూటర్‌, ఎలక్ట్రీషియన్‌, ప్లంబరు, వెల్డర్‌, పెయింటిగ్‌ వంటి వృతులపై శిక్షణ ఇస్తారన్నారు. అర్హులను గుర్తించి, ఆసక్తి కల్గిన వారిని నమోదు చేయాలన్నారు.

పెద్దపంజాణి : నైపుణ్యాభివృద్ధిపై త్వరలో సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాని ఎంపీడీఓ బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరి విద్య, వృత్తి వివరాలతోపాటు వారికి ఏ విషయంలో నైపుణ్యం ఉంది అనే విషయం సమగ్రంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, పంచాయతీ విస్తరణా అధికారి శారదాదేవి, రీసోర్స్‌పర్సన్‌ హరిబాబు, వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ సోమశేఖర్‌ పాల్గొన్నారు.

చౌడేపల్లె : అర్హులకు ఉపాధి కల్పన కోసమే నైపుణ్య గణన ప్రభుత్వం చేపడుతున్నట్లు ఎంపీడీవో లీలా మాధవి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నైపుణ్య గణనపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరు డోర్‌ టూ డోర్‌ వెళ్లి సర్వే నిర్వహించి, యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండిపేట-కోటూరు మార్గంలో ప్రమాదకరంగా వంతెన



కౌండిన్య నదిపై రక్షణ ఫిల్లర్లు లేని వంతెన

పలమనేరు, నవంబరు4 : పలమనేరు మండలం మండిపేట కోటూరు మార్గంలో కౌండిన్య నదిపై ఉన్న వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ ఫిల్లర్లు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. మండలంలోని గుడియాత్తం రహదారిలో బేరుపల్లి-మండీపేట కోటూరు రహదారిలో కౌండిన్య నదిపై దశాబ్దం క్రితం వంతెన నిర్మించారు. ఈ వంతెన నాసిరకంగా నిర్మించడంతో వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ ఫిల్లర్లు వంతెన నిర్మించిన నాలుగేళ్లకే విరిగిపోయాయి. దీంతో వాహనదారులు ఈమార్గంలో వెళ్లే సందర్భంగా ఎదురుగా మరోవాహనం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాన్ని నడిపినా అదుపు తప్పితే 10 అడుగుల లోతు ఉన్న కౌండిన్య నదిలో వాహనం పడిపోయే ప్రమాదం వుంది. కావున అధికారులు వెంటనే స్పందించి వంతెనకు రక్షణఫిల్లర్లు నిర్మించాలని ఈ మార్గం మీదుగా పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు కోరుతున్నారు.

ఆ మానవ మృగాన్ని అరెస్టు చేయాలి

పలమనేరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలంలో మూడేళ్ల చిన్నారిని చిదిమేసిన కామాంధుడిని తక్షణమే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని మానవహక్కుల సంఘం నాయకులు డీవీ మునిరత్నం, మణి, పార్థసారథి, శివన్న డిమాండు చేశారు. సోమవారం వారు పలమనేరులో మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు జరిగిన వెంటనే పోలీసులు స్పందించి మానవ మృగాలకు తగిన విధంగా శిక్షించాలని కోరారు. చిన్నారిని కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం స్పందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థిక సాయం అందజేయాలని కోరారు.

సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సోమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సూరయ్యగారిపల్లె హైస్కూల్‌ విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం నిరంజన్‌కుమార్‌ తెలిపారు. ఎం.మధుప్రియ, మహావిష్ణువర్ధన్‌, అనన్య, అనీషాలు సాఫ్ట్‌బాల్‌కు ఎంపిక కావడంతో పీడీ శివకుమార్‌, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్‌, కుసుమ, విద్యావతి విద్యార్థులను అభినందించారు.

భూసమస్యను పరిష్కరించాలి

బైరెడ్డిపల్లె,నవంబరు4(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాతిరెడ్డిపల్లెలో నెలకొన్న భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బాధితురాలు వెంకటలక్ష్మమ్మ కుటుంబీకులు దళిత సంఘ నాయకులతో కలసి తహసీల్దార్‌ మాధవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నో యేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమిని కొందరు ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్‌ వారికి హామీ ఇచ్చారు.

ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన

బైరెడ్డిపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో సోమవారం వెలుగు మహిళా సంఘ సభ్యులకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సీజనల్‌ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత, వ్యాధినిరోధక టీకాలు, పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఆశకార్యకర్తలు రాజేశ్వరి, జయమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



డైనింగ్ హాల్



డైనింగ్ హాల్ లోపలి భాగం

ఐవోసీఎల్ దాతృత్వం... టీచర్ల ఔదార్యం

కాశిరాళ్ల గొల్లపల్లె హైస్కూల్‌కు కొత్త హంగులు

యాదమరి మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 430మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు.పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పాడైపోయాయి. దానికి తోడు మధ్యాహ్న భోజనం తయారుచేయడానికి సరైన వంట గది లేక పాఠశాల ఆవరణలోనే వంటచేసే వారు. విద్యార్థులు మధ్యాహ్నం పూట భోజనం చేయడానికి సరైన వసతి లేకపోవడంతో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ కూర్చుని తినేవారు. మల, మూత్ర విసర్జన కోసమైతే పొలాల్లోకి వెళ్లాల్సిందే. పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు గుర్తించారు. దాతల కోసం ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో యాదమరి మండలంలోని పెరుమాళ్లపల్లె వద్ద ప్లాంటును ఏర్పాటు చేసిన ఐవోసీఎల్ సంస్థ నిర్వాహకులను సంప్రదించారు.సంస్థకు వచ్చిన లాభాల్లో పదిశాతం సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తుండడంతో పాఠశాలకు వసతులను సమకూర్చేందుకు ముందుకొచ్చారు.పాఠశాల ఆవరణలో రూ.50లక్షల వ్యయంతో అధునాతన వసతులతో కూడిన డైనింగ్ హాలు, వంట గది, మరుగుదొడ్లను నిర్మించారు. పచ్చదనం పెంపుకోసం జామ, మామిడి, టేకు మొక్కలను నాటారు. ఈ నెల 7వతేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఈవో వరలక్ష్మీతో పాటు ఐవోసీఎల్ డీజీఎం అమితాబ్ సర్దార్, అధికారులు కైలాష్ కాంత్, అరుణ్ ప్రసాద్ తదితరులు కలిసి వీటిని ప్రారంభించనున్నారు.వీరికి తోడు హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులంతా కలిసి పాఠశాల ఆవరణలో రూ.1.50 లక్షల వ్యయంతో సరస్వతీదేవి మందిరాన్ని నిర్మించారు. విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి రూ.70వేలతో తాగునీటి బోరు, మోటరును ఏర్పాటు చేశారు.

- యాదమరి, ఆంధ్రజ్యోతి



వంట గది



మరుగుదొడ్డి

క విజయ యాత్ర



ఇటీవల విడుదలై విజయం సాధించిన క సినిమా విజయ యాత్ర సోమవారం చిత్తూరుకు చేరుకుంది.సినిమా ప్రదర్శింపబడుతున్న గురునాథ థియేటర్‌కు వచ్చిన హీరో కిరణ్ అబ్బవరం ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రేక్షకులు ఆదరించేలా నూతన దర్శకులు సుజిత్ సందీప్ చిత్రాన్ని చక్కగా మలిచారని చెప్పారు. ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. థియేటర్ యజమాని బాలగురునాథం, మేనేజర్ విజయ్ ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరంతో పాటు యూనిట్ సభ్యులను సత్కరించారు.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖర నాయుడు



సోమశేఖర్‌నాయుడు, మణిగండన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఎం.సోమశేఖర నాయుడు ఎన్నికయ్యారు. స్వర్ణోత్సవ సంబరాలు.. 17వ జిల్లా మహాసభల్లో భాగంగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.మణిగండన్, కోశాధికారిగా ప్రసన్నకుమార్, గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రెడ్డెప్పనాయుడు, రెహానాబేగం, కార్యదర్శులుగా ప్రకాష్, కృష్ణమూర్తి, సురేష్, దక్షిణామూర్తి, ఏకాంబరం, ఈశ్వర్, సరిత, పార్థసారథి, సురేష్, గణేష్, రమణ ఎన్నికయ్యారు. వీరితోపాటు పలు కమిటీల కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, పరిశీలకులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ వ్యవహరించారు.

13 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 13 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. గంగవరంలో అత్యధికంగా 30.6 మి.మీ, పెనుమూరులో అత్యల్పంగా 0.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. రామకుప్పంలో 30.2, పలమనేరులో 22, కుప్పంలో 17.2, శాంతిపురంలో 12.4, చిత్తూరు రూరల్‌లో 11, గుడుపల్లెలో 5.8, బైరెడ్డిపల్లెలో 3.8, రొంపిచెర్లలో 3.4, పుంగనూరు, చిత్తూరు అర్బన్‌లో 2, వి.కోటలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

బైక్‌తో చెట్టును ఢీకొన్న యువకుడి మృతి



లోకేష్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌తో చెట్టును ఢీకొన్న ఓ యువకుడు మృతి చెందాడు. చిత్తపార పంచాయతీ రాయల్‌చేనుకు చెందిన లోకేష్ చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యం నుంచి గ్రామానికి ఆదివారం రాత్రి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యంలోని బండపల్లె క్రాస్ వద్ద ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో కుటుంబీకులు వెంటనే అతడిని 190 రామాపురం సీఎంసీకి తీసుకెళ్లారు. వైద్యులు వేలూరుకు తీసుకెళ్లాలని చెప్పడంతో అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబీకులు సోమవారం తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఎల్లంకివారిపల్లి వద్ద పంటలపై ఏనుగుల దాడులు

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి వద్ద ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రెండు రోజులుగా ఎల్లంకివారిపల్లి సమీపంలోని భీమవరం అటవీప్రాంతంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు రాత్రి వేళ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అరటి, కొబ్బరి, వరి, మామిడి, మిరప, అనప, అలసంద, బీర తదితర పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా భీమవరం అటవీప్రాంతం నుంచి ఆదివారం రాత్రి ఎల్లంకివారిపల్లి వద్దకు 16 ఏనుగుల గుంపు చేరుకున్నాయి. ఎల్లంకివారిపల్లిలో భీమరాజుకు చెందిన అరటి చెట్లు, కొబ్బరిచెట్లు, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంకు చెందిన అరటిచెట్లు, మామిడితోటకు ఏర్పాటుచేసిన 12 రాతికూసాలను విరిచేశాయి. వరి చేను లో కుప్పబోసిన గురునాథంకు చెంది న వడ్ల మూటలను ఏనుగులు తినేసి చిందర వందరచేశాయి. పోశంవారిపల్లిలో మోహన్‌రెడ్డికి చెందిన చిక్కుడు, టమోటా, బీర, బెండ చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు బుజ్జమ్మకు చెందిన అలసంద, కళావతికి చెందిన అనపపంట, రాణెమ్మకు చెందిన మిరపపంట, లక్ష్మీకాంతమ్మకు చెందిన మామిడిచెట్లు, విజేంద్రరెడ్డికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయానికి రాయవారిపల్లి మీదుగా శేషాపురం సమీపంలోని అడవిలోకి చేరుకున్నట్లు ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి తెలిపారు. ధ్వంసమైన పంటలను ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి, ఎఫ్‌బీఓలు హరిప్రియ, మున్నా, కృష్ణమూర్తి పరిశీలించారు.



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

గ్రూపులు కడితే నష్టపోయేది మీరే..

రామకుప్పం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీలో నేతలు, కార్యకర్తలు గ్రూపులు కడితే నష్టపోయేది వారేనని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంలు హెచ్చరించారు. సోమవారం రామకుప్పంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడితే వారు ఎంతటి వారైనా అధిష్ఠాన వర్గం ఉపేక్షించేది లేదన్నారు. పాత, కొత్త నాయకత్వాలు ఐక్యతతో సాగాలన్నదే అధిష్ఠాన వర్గం ఆపేక్ష అన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: నేతలు, కార్యకర్తలు సమష్టి కృషితో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం కోరారు. సోమవారం శాంతిపురంలో సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథనాయుడు, నాగరాజు, నేతలు విజయ రామిరెడ్డి, చలపతిస్వామి, ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ మణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ళ

అతిగా మద్యం తాగిన వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహం

నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని పాండురాజుపురం జగనన్న కాలనీలో నివాసముంటున్న ఎస్కే. గోవర్ధన్ అలియాస్ నాగరాజు అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ సమీపంలో నాగరాజు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి పరిశీలిస్తే.. మద్యం అతిగా తాగాక ఫిట్స్ రావడం, సమయానికి ఎవరూ లేకపోవడంతో మృతి చెందినట్లు తేలింది. మృతదేహానికి సోమవారం నగరి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం చేసి, కుటుంబీకులకు అప్పగించారు.

బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న వారు, కొత్తగా ఏర్పాటు చేయాలనుకునేవారు అనుమతి తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 97013 86650, 94913 55890 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

టీచర్ సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లోని టీచర్ల పదోన్నతులకు పాఠశాల విద్యా సంచాలకుల ఉత్తర్వుల మేరకు డీఈవో వరలక్ష్మి సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎస్టీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. టీచర్ల సబ్జెక్టు, మీడియంవారీగా సీనియారిటీ జాబితాను ఎంఈవో, డీవైఈవో మెయిల్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను తగిన ఆధారాలతో బుధవారంలోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు



నిందితురాలి వివరాలు తెలియజేస్తున్న అధికారులు

నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని బుగ్గఅగ్రహారంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది దాడులు చేశారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న వి.లక్ష్మి(58)ని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 53 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితురాలిని నగరి పోలీసులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ సురేంద్ర, పీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు



నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ

బంగారుపాళ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికకు అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఓ బాలికను బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేనుకు చెందిన మునిరత్నం కుమారుడు నరేంద్ర (23) మాయ మాటలు చెప్పి అపహరించాడు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం నలగాంపల్లె వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం అతడిపై పోక్సో కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

తిరుపతిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్కృత వర్సిటీలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తొలిమూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ పి.వెంకట్రావ్, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సీతారాంశర్మ పాల్గొన్నారు.

బీఎల్వోలకు గౌరవ వేతనాలిప్పించండి

తిరుపతి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో పనిచేస్తున్న తమకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం ఇప్పించాలని బీఎల్వోలు కోరారు. గ్రీవెన్స్‌లో ఆర్డీవోకు బీఎల్వోలు వినతిపత్రం అందజేశారు.

నేత్రపర్వం.... లక్ష దీపోత్సవం



దీపాలతో వెలుగుతున్న నారద పుష్కరిణి





ఆకాశ దీపం - దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

శ్రీకాళహస్తి, , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారద పుష్కరిణిలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా పుష్కరణి చుట్టూ నేతి దీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష హారతులు సమర్పించాక లక్షదీపోత్సవాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రిషితారెడ్డి దంపతులు దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో మొదటిసారి జరిగిన ఈ విశేష వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. దీప కాంతులతో నారదపుష్కరణి దేదీప్యమానంగా ప్రకాశించింది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు.

అంబటి, రోజాను కొండపైకి రాకుండా టీటీడీ నిషేధం విధించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, మాజీ మంత్రులైన అంబటి రాంబాబు, రోజాను తిరుమల కొండపైకి రాకుండా టీటీడీ అధికారులు నిషేధం విధించాలని టీటీడీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో రాజకీయ కార్యక్రమాలు, పార్టీ బ్యానర్లు, స్టిక్కర్లు, జెండాలు, బ్యాడ్జీలు ప్రదర్శించరాదని, నినాదాలు చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయన్నారు. అంబటి నిబంధనలకు విరుద్ధంగా మాజీ సీఎం జగన్ బ్యాడ్జీ ధరించి స్వామివారి దర్శనానికి వెళ్లడం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. అంబటి రాంబాబు, రోజా, విజయసాయి రెడ్డి.. తిరుమలలో రాజకీయ ప్రకటనలు చేయడం, సవాళ్లు విసరడం టీటీడీ నిబంధనలకు విరుద్ధమని, వీరిపై పదేళ్లపాటు నిషేధం విధించాలని అన్నారు. నేతలు మోహన్ రాజ్, మధుయాదవ్, షబ్బీర్ బాయ్, జైపాల్ పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన దేవప్రసాదరాజు డీఓఏ డిప్యూటీ డైరెక్టర్‌గా, శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, ఏపీఆర్‌సెట్-2024 కన్వీనర్‌గా పనిచేశారు. మూడు రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన దేవప్రసాదరాజును పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సత్కరించారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వైసీపీ: మంత్రి అనిత



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. రుషికొండ ప్యాలెస్ ఎవరి కోసం నిర్మించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కపిలతీర్థంలోని శివాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో బాబు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులతో వేద ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, అధికారులు ఉన్నారు.

నేడు సబ్‌స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ నిరసనలు

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీల సర్దుబాటుకు నిరసనగా మంగళవారం జిల్లాలోని అన్ని ప్రధాన విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపడుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ సోమవారం ధ్రువీకరించారు. కార్వేటినగరం మండలం అన్నూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన నిర్వహిస్తున్నామని జీడీనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ సోమవారం తెలిపారు.



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35వేలమంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారుల అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరునగరిలో భూకైలాస్

● రూపుదిద్దుకుంటున్న మహా నంది-శివలింగ మందిరం

● రూ. 5కోట్ల వ్యయంతో ఎత్తయిన నిర్మాణం

● బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివభక్తులకు కానుక





రూపుదిద్దుకుంటున్న మూడంతస్తుల శివలింగ మందిరం

భవనంపై భాగంలో ప్రతిష్ఠించనున్న నంది, శివ పార్వతుల విగ్రహాలు

తిరుపతి అనగానే ఠక్కున వేంకటేశ్వర స్వామి గుర్తుకు వస్తారు. పుణ్యక్షేత్రంగా తిరునగరి ఇప్పుడు మరో ఆధ్యాత్మిక కేంద్రం కొలువుదీరనుంది. ప్రముఖ దర్శనీయ స్థలాల సరసన ఇది చోటు సంపాదించుకోనుంది. భక్తులను పరవశుల్ని చేసేలా అపురూప 'నంది-శివ లింగ మందిరం' రూపుదిద్దుకుంటోంది. ఇది దేశంలోనే మూడవదిగా చెబుతున్నారు. రాష్ట్రంలో రెండో ఎత్తయిన శివ లింగ మందిరంగా నిలిచేం ద ు క ు సమాయత్తమవుతోంది. పుట్టపర్తిలో 75 అడుగుల ఎత్తులో ఇదే నమూనాతో శివ లింగ మందిరం ఉంది. బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి శివారు మంగళం క్వార్టర్స్ సమీపాన నంది-శివలింగ మందిర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పదెకరాల విస్తీర్ణంలో బ్రహ్మకుమారీల ఆశ్రమంలోనే ఈ మందిరం ఏర్పాటు కానుంది. 1.25ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత, ఆహ్లాదరకర వాతావరణంలో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో మూడంతస్తుల మందిర నిర్మాణాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గతేడాది అక్టోబరులో పనులు మొదలవగా.. ఇప్పటికి సగం పనులు పూర్తయ్యాయి. భక్తులను ఆకట్టుకునేలా మందిరాన్ని నిర్మించేందుకు 50 మంది శిల్పులు నిత్యం శ్రమిస్తున్నారు.

శివలింగమందిర విశేషాలు

భూమట్టం నుంచి 67అడుగుల ఎత్తు, 67అడు గ ు ల వెడల్పు చుట్టుకొలత మధ్య మూడు అంతస్తుల్లో శివలింగమందిరాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో వేంకటేశ్వర స్వామి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మొదటి అంతస్తులో రాజయోగ అభ్యాసనం వీడియో షో ప్రదర్శించనున్నారు. ధ్యానం చేసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నారు. మెట్ల సదుపాయం కూడా ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

సిద్ధమవుతున్న భారీ నంది

శివలింగం ముందుభాగాన శివనామాలు, మూడోనేత్రానికి సమాన ఎత్తులో మరో నిర్మాణం చేపట్టారు. దాదాపు 60అడుగుల ఎత్తులో భారీ నంది ఏర్పాటు కానుంది. శివుని మూడో నేత్రం, నంది నయనాలు సమాన కొలతతో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 24అడుగుల పొడవు, 16అడుగుల ఎత్తుతో భారీ నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సరికొత్త ఆలోచనలే పెట్టుబడి

● 'అగ్రి'లో అంకుర సంస్థలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ వీసీ జేవీ రమణ, ఏడీ రమణ తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలలో సరికొత్త ఆలోచనలు కలిగి అంకుర సంస్థలు ఏర్పాటు చేయదలచిన ఔత్సాహికుల నుంచి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రం ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు స్కీమ్‌ల ద్వారా ఈ దరఖాస్తులను కోరుతున్నారు. వినూత్న ఆలోచన వరకే పరిమితమైన వారికి యోచ్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు, ప్రోటోటైప్ నమూనా ఉన్న వారికి అగ్రి ఇన్వో ద్వారా రూ.25లక్షల వరకు ఫండింగ్ అందించనున్నారు. ఈ ఏడాది కొత్తగా మెరిస్టమ్స్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఇందులో నూతన ఆలోచనలతో వ్యవసాయ అంకుర సంస్థలు నెలకొల్పేందుకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులకు(కోర్సు పూర్తి) రూ.4లక్షల వరకు ఐడియా ఫండింగ్ అందిస్తారు. ఈ పథకాల ద్వారా ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఫండింగ్ ద్వారా అంకుర సంస్థల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారు. వచ్చేనెల 4వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇతర వివరాల కోసం 'ఏఎన్‌జీఆర్‌ఏయూఆర్‌ఏబీఐటీపీటీ.ఓఆర్జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంది. ఈ కేంద్రం ద్వారా నిర్వహించే 8వ బ్యాచ్‌కి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రమణతో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి కలసి విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కదిరి మోహన్, కోప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ ప్రారంభం

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రంలో సోమవారం 7వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. వ్యవసాయ, వెటర్నరీ రంగాలను అనుసంధానిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి సూచించారు. వ్యవసాయ ఇంజినీరింగ్‌లో వస్తున్న ఆవిష్కరణలను వివరించారు.

చెంచయ్య మృతదేహానికి రీ పోస్టుమార్టం



పటిష్ఠ పోలీసుల భద్రత నడుమ పోస్టుమార్టం చేస్తున్న వైద్య బృందం

పెళ్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున గత నెల 23న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బండి చెంచయ్య మృతదేహానికి సోమవారం రీ పోస్టుమార్టం జరిగింది. వడ్డిపాలేనికి చెందిన చెంచయ్య గత నెల 23న మృతి చెందగా 24న నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నాయుడుపేటలో జరిగిన పోస్టుమార్టంపై తమకు నమ్మకం లేదని, మరోసారి పోస్టుమార్టం చేసి న్యాయం చేయాలని మృతుడి భార్య ప్రమీలమ్మ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 29న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు.. సోమవారం రీపోస్టుమార్టం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో తిరుపతి స్విమ్స్ వైద్యులు గ్రామానికి చేరుకుని బంధువులు, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి మళ్లీ పోస్టుమార్టం చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు, ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల నియామకాల సమగ్ర సమాచారమివ్వండి

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో 2008 ఏప్రిల్1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని ఏపీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారి గత నెల 29న జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగుచూసింది. వర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేసే జి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.రాజేష్‌రెడ్డిలకు సంబంధించిన సర్వీస్ రికార్డ్స్‌తో పాటు వీరిద్దరిపై ఏమైనా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయా..? అలా ఉంటే ఫైల్‌తోపాటు కేసుల స్థితివంటి సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వర్సిటీ నిధుల్లో చేసిన డబుల్ పేమెంట్స్, దీనికి సంబంధించి న్యాయపరమైన సమస్యలు, పునరుద్ధరణ వంటి వివరాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ పద్ధతిలో చేపట్టిన కంపాజినేట్(కారుణ్య) నియామకాల సమాచారాన్ని అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అంతకు ముందు ఆంగ్రువర్సిటీలో వెటర్నరీ అంతర్భాగంగా ఉన్నప్పుడు చేపట్టిన మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై కోర్టులో కేసు నడుస్తుందని, వీటిపై కూడా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఏజీ కార్యాలయం నుంచి సమాచారం అడగడంతో పలువురు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్న చర్చ వర్సిటీలో నడుస్తోంది.

అది పట్టా భూమే

● అర్బన్ తహసీల్దారు వెల్లడి

తిరుపతి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 114లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి స్పందించారు. రెవెన్యూ అధికారులను తనిఖీకి పంపామని,షెడ్లు నిర్మించిన స్థలం ప్రైవేట్ వ్యక్తులదని చెప్పారు. అయితే ఆ స్థలంలోకి వెళ్లేందుకు కాలువను దారిగా మార్చుకున్నట్టు ప్రాథమిక సర్వేలో గుర్తించామన్నారు.ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకుని చేశారా లేదా తెలుసుకునేందుకు మంగళవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూఅధికారులతో సంయుక్తంగాకాలువ ఆక్రమణ అంశంపై విచారణ జరుపుతామన్నారు.



సైబర్ క్రైం అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ

డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సైబర్ క్రైం వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ భాగమైపోయాయని, దీన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు సులభంగా బురిడీ కొట్టిస్తున్నారన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని తోటి వారిని చైతన్యపరచి సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత, ఉద్యోగులు, మహిళలు, ఐటీ నిపుణులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వీసీ ఉమ కోరారు. అవసరం లేని యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సైబర్ క్రైం నిపుణుడు ఐఎల్ నరసింహారావు సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీఎస్పీలు వెంకటనారాయణ, శ్రీలత, మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యులు, పోలీసు అధికారులు, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రోజావి నిరాధార ఆరోపణలు

● ఆమెను అరెస్టు చేయాలంటూ తెలుగు మహిళల ఫిర్యాదు



రోజాపై ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న తెలుగు మహిళలు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి రోజాను వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం పుత్తూరు ఎస్ఐ ఓబయ్యకు ఫిర్యాదు చేశారు. 'టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆడపిల్లల్ని రేప్ చేస్తుంటే, తగలబెడుతుంటే, ముక్కలు ముక్కలుగా నరికేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత కేసులు పెట్టడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏమి చేస్తున్నాడు' అంటూ రోజా నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న తప్పుపట్టారు. మూడున్నరేళ్ల చిన్నారి అఘాయిత్యానికి గురై.. తల్లిదండ్రులు గర్భశోకంలో ఉంటే మంత్రి రోజా ఆస్పత్రి వద్ద రాజకీయాలు మాట్లాడటం దారుణమన్నారు. గత ప్రభుత్వ గంజాయి మూలాలతోనే ఇప్పుడు జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు టీడీపీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బసంతి, కౌన్సిలర్ భువనేశ్వరి, భారతి, నాగరత్న, రజినీ, మోహన తదితరులు పాల్గొన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 181 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారం కాని సమస్యలు ఎందుకు అనేది వివరణాత్మకంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు అందగా రెవెన్యూ శాఖవే 119 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ వర్సిటీలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి జయచంద్ర డిమాండు చేశారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా 2012 చట్టం ప్రకారమే జీతాలు అందిస్తున్నారన్నారు. ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీ, మునిరాజా, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ నాగరత్నమ్మ, మస్తాన్, పరశురామ్ పాల్గొన్నారు.

అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోండి

ఇటీవల కాలంలో పెరిగిపోతున్న అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మద్యం, డ్రగ్స్ కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వడమాలపేట మండలంలో చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తమ గ్రామంలో మేత పొరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారని ఓజిలి మండలం, మనవాలి గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు రికార్డులు సృష్టించి, ఆక్రమించుకున్నారని తెలిపారు. రీసర్వేలోనూఅవకతవకలు జరిగాయని, 2.93సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమార్కులు తమ పేరుతో బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై విచారణ జరపాలని విన్నవించారు.

మీ సర్వేయరే నా స్థలం కబ్జా చేశాడు



బాధితుడు సుబ్బన్న

● గ్రీవెన్స్‌లో ఆర్డీవో వద్ద బాధితుడి ఆవేదన

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర పనిచేసే సర్వేయరే నా స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టేసుకున్నాడు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగడంలేదు. మీరైనా సర్వే చేయించి న్యాయం చేయండి' అంటూ ఆర్డీవో రామ్మోహన్ ముందు ఓ బాధితుడు ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో రూరల్ మండలం అవిలాల గ్రామానికి చెందిన వి.సుబ్బన్న వినతి పత్రం అందజేశారు. డాక్యుమెంట్లు పరిశీలించిన ఆర్డీవో ఇప్పటి ఈసీ తీసుకొస్తే జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్‌తో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా బాధితుడు సుబ్బన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 28/3లో 10 సెంట్లు, 28/4లో 0.39 సెంట్లు, 28/2లో 27 సెంట్లు స్థలం అనువంశికంగా మా స్వయార్జితం. 28/3లో చిట్టిబాబు అనే సర్వేయర్‌కు 30 అంకణాల భాగం విక్రయించాను. ఆ స్థలాన్ని వేరేవాళ్లకు విక్రయించేసి, 28/4లో నేను నిలుపుకొన్న స్థలాన్ని ఆక్రమించి 40 అంకణాలకు పైగా ఇల్లు నిర్మించుకున్నాడు. సదరు స్థలాలను సర్వే చేయడానికి రూరల్ తహసీల్దారును పలుసార్లు కోరినా సర్వేయర్లు ముందుకు రావడంలేదు. సర్వే నివేదిక ఇవ్వడంలేదు. అతడు సర్వేయర్ కావడంతో ఇతర సర్వేయర్లు నాకు సహకరించడంలేదు. గత వారం గ్రీవెన్స్‌కి వచ్చినప్పుడు తనపై దాడి చేస్తున్నానని నాపై సర్వేయర్ చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆర్డీవోను కలవనీయకుండా చేశారు. జిల్లా సర్వేయర్ ద్వారా 28/3, 28/4 నెంబర్లకు సర్వే జరిపి మాకు హద్దులు చూపించాలని కోరుతున్నా' అని విజ్ఞప్తి చేశారు. దీనిపై చిట్టిబాబును వివరణ కోరగా తాను కొనుగోలు చేసిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ యునైటెడ్ ఆశ్కా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు మునేంద్ర మాట్లాడుతూ గ్రామీణుల ఆరోగ్య విషయంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తారని, అలాంటి వారికి రూ.10వేలు గౌరవ వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని అన్నారు. జీతాలు పెంచి, పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీరా, జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రసూతి సెలవులు 3 నెలలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు పద్మావతి, లక్ష్మమ్మ, సుందరమ్మ, శారద, అమరావతి, సుగుణ, మంగమ్మ, సరిత పాల్గొన్నారు.



డైనింగ్ హాల్



డైనింగ్ హాల్ లోపలి భాగం

ఐవోసీఎల్ దాతృత్వం...

టీచర్ల ఔదార్యం

కాశిరాళ్ల గొల్లపల్లె హైస్కూల్‌కు కొత్త హంగులు

యాదమరి మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 430మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు.పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పాడైపోయాయి. దానికి తోడు మధ్యాహ్న భోజనం తయారుచేయడానికి సరైన వంట గది లేక పాఠశాల ఆవరణలోనే వంటచేసేవారు. విద్యార్థులు మధ్యాహ్నం పూట భోజనం చేయడానికి సరైన వసతి లేకపోవడంతో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ కూర్చుని తినేవారు. మల, మూత్ర విసర్జన కోసమైతే పొలాల్లోకి వెళ్లాల్సిందే. పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు గుర్తించారు. దాతల కోసం ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో యాదమరి మండలంలోని పెరుమాళ్లపల్లె వద్ద ప్లాంటును ఏర్పాటు చేసిన ఐవోసీఎల్ సంస్థ నిర్వాహకులను సంప్రదించారు.సంస్థకు వచ్చిన లాభాల్లో పదిశాతం సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తుండడంతో పాఠశాలకు వసతులను సమకూర్చేందుకు ముందుకొచ్చారు.పాఠశాల ఆవరణలో రూ.50లక్షల వ్యయంతో అధునాతన వసతులతో కూడిన డైనింగ్ హాలు, వంట గది, మరుగుదొడ్లను నిర్మించారు. పచ్చదనం పెంపుకోసం జామ, మామిడి, టేకు మొక్కలను నాటారు. ఈ నెల 7వతేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఈవో వరలక్ష్మీతో పాటు ఐవోసీఎల్ డీజీఎం అమితాబ్ సర్దార్, అధికారులు కైలాష్ కాంత్, అరుణ్ ప్రసాద్ తదితరులు కలిసి వీటిని ప్రారంభించనున్నారు.వీరికి తోడు హెచ్ఎం లలిత, ఉపాధ్యాయులంతా కలిసి పాఠశాల ఆవరణలో రూ.1.50 లక్షల వ్యయంతో సరస్వతీదేవి మందిరాన్ని నిర్మించారు. విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి రూ.70వేలతో తాగునీటి బోరు, మోటరును ఏర్పాటు చేశారు.

- యాదమరి, ఆంధ్రజ్యోతి



వంట గది



మరుగుదొడ్డి

క విజయ యాత్ర



ఇటీవల విడుదలై విజయం సాధించిన క సినిమా విజయ యాత్ర సోమవారం చిత్తూరుకు చేరుకుంది.సినిమా ప్రదర్శింపబడుతున్న గురునాథ థియేటర్‌కు వచ్చిన హీరో కిరణ్ అబ్బవరం ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రేక్షకులు ఆదరించేలా నూతన దర్శకులు సుజిత్ సందీప్ చిత్రాన్ని చక్కగా మలిచారని చెప్పారు. ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. థియేటర్ యజమాని బాలగురునాథం, మేనేజర్ విజయ్ ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరంతో పాటు యూనిట్ సభ్యులను సత్కరించారు.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖర నాయుడు




సోమశేఖర నాయుడు, మణిగండన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఎం.సోమశేఖర నాయుడు ఎన్నికయ్యారు. స్వర్ణోత్సవ సంబరాలు.. 17వ జిల్లా మహాసభల్లో భాగంగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.మణిగండన్, కోశాధికారిగా ప్రసన్నకుమార్, గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రెడ్డెప్పనాయుడు, రెహనాబేగం, కార్యదర్శులుగా ప్రకాష్, కృష్ణమూర్తి, సురేష్, దక్షిణామూర్తి, ఏకాంబరం, ఈశ్వర్, సరిత, పార్థసారథి, సురేష్, గణేష్, రమణ ఎన్నికయ్యారు. వీరితోపాటు పలు కమిటీల కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, పరిశీలకులుగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ వ్యవహరించారు.

13 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 13 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. గంగవరంలో అత్యధికంగా 30.6 మి.మీ, పెనుమూరులో అత్యల్పంగా 0.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. రామకుప్పంలో 30.2, పలమనేరులో 22, కుప్పంలో 17.2, శాంతిపురంలో 12.4, చిత్తూరు రూరల్‌లో 11, గుడుపల్లెలో 5.8, బైరెడ్డిపల్లెలో 3.8, రొంపిచెర్లలో 3.4, పుంగనూరు, చిత్తూరు అర్బన్‌లో 2, వి.కోటలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

బైక్‌తో చెట్టును ఢీకొన్న యువకుడి మృతి



లోకేష్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌తో చెట్టును ఢీకొన్న ఓ యువకుడు మృతి చెందాడు. చిత్తపార పంచాయతీ రాయల్‌చేనుకు చెందిన లోకేష్ చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యం నుంచి గ్రామానికి ఆదివారం రాత్రి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యంలోని బండపల్లె క్రాస్ వద్ద ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో కుటుంబీకులు వెంటనే అతడిని 190 రామాపురం సీఎంసీకి తీసుకెళ్లారు. వైద్యులు వేలూరుకు తీసుకెళ్లాలని చెప్పడంతో అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబీకులు సోమవారం తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఎల్లంకివారిపల్లి వద్ద పంటలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట

కల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి వద్ద ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రెండు రోజులుగా ఎల్లంకివారిపల్లి సమీపంలోని భీమవరం అటవీప్రాంతంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు రాత్రి వేళ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అరటి, కొబ్బరి, వరి, మామిడి, మిరప, అనప, అలసంద, బీర తదితర పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా భీమవరం అటవీప్రాంతం నుంచి ఆదివారం రాత్రి ఎల్లంకివారిపల్లి వద్దకు 16 ఏనుగుల గుంపు చేరుకున్నాయి. ఎల్లంకివారిపల్లిలో భీమరాజుకు చెందిన అరటిచెట్లు, కొబ్బరిచెట్లు, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంకు చెందిన అరటిచెట్లు, మామిడితోటకు ఏర్పాటుచేసిన 12 రాతికూసాలను విరిచేశాయి. వరి చేను లో కుప్పబోసిన గురునాథంకు చెంది న వడ్ల మూటలను ఏనుగులు తినేసి చిందర వందరచేశాయి. పోశంవారిపల్లిలో మోహన్‌రెడ్డికి చెందిన చిక్కుడు, టమోటా, బీర, బెండ చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు బుజ్జమ్మకు చెందిన అలసంద, కళావతికి చెందిన అనపపంట, రాణెమ్మకు చెందిన మిరపపంట, లక్ష్మీకాంతమ్మకు చెందిన మామిడిచెట్లు, విజేంద్రరెడ్డికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయానికి రాయవారిపల్లి మీదుగా శేషాపురం సమీపంలోని అడవిలోకి చేరుకున్నట్లు ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి తెలిపారు. ధ్వంసమైన పంటలను ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి, ఎఫ్‌బీఓలు హరిప్రియ, మున్నా, కృష్ణమూర్తి పరిశీలించారు.

గ్రూపులు కడితే నష్టపోయేది మీరే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల

రామకుప్పం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్టీలో నేతలు, కార్యకర్తలు గ్రూపులు కడితే నష్టపోయేది వారేనని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంలు హెచ్చరించారు. సోమవారం రామకుప్పంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడితే వారు ఎంతటి వారైనా అధిష్ఠాన వర్గం ఉపేక్షించేది లేదన్నారు. పాత, కొత్త నాయకత్వాలు ఐక్యతతో సాగాలన్నదే అధిష్ఠాన వర్గం ఆపేక్ష అన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: నేతలు, కార్యకర్తలు సమష్టి కృషితో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం కోరారు. సోమవారం శాంతిపురంలో సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో చేపట్టే సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథనాయుడు, నాగరాజు, నేతలు విజయరామిరెడ్డి, చలపతిస్వామి, ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ మణి పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగిన వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహం

నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని పాండురాజుపురం జగనన్న కాలనీలో నివాసముంటున్న ఎస్కే. గోవర్దన్ అలియాస్ నాగరాజు అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ సమీపంలో నాగరాజు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి పరిశీలిస్తే.. మద్యం అతిగా తాగాక ఫిట్స్ రావడం, సమయానికి ఎవరూ లేకపోవడంతో మృతి చెందినట్లు తేలింది. మృతదేహానికి సోమవారం నగరి ఏరియా వైద్యశాలలో పోస్టు మార్టం చేసి, కుటుంబీకులకు అప్పగించారు.

బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న వారు, కొత్తగా ఏర్పాటు చేయాలనుకునేవారు అనుమతి తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 97013 86650, 94913 55890 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

టీచర్ సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లోని టీచర్ల పదోన్నతులకు పాఠశాల విద్యా సంచాలకుల ఉత్తర్వుల మేరకు డీఈవో వరలక్ష్మి సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎస్టీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. టీచర్ల సబ్జెక్టు, మీడియంవారీగా సీనియారిటీ జాబితాను ఎంఈవో, డీవైఈవో మెయిల్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను తగిన ఆధారాలతో బుధవారంలోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు



నిందితురాలి వివరాలు తెలియజేస్తున్న అధికారులు

నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని బుగ్గఅగ్రహారంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది దాడులు చేశారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న వి.లక్ష్మి(58)ని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 53 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితురాలిని నగరి పోలీసులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ సురేంద్ర, పీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు



నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ

బంగారుపాళ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికను అపహరించిన వ్యక్తిని అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఓ బాలికను బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేనుకు చెందిన మునిరత్నం కుమారుడు నరేంద్ర (23) మాయమాటలు చెప్పి అపహరించాడు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం నలగాంపల్లె వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం అతడిపై పోక్సో కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

తిరుపతిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్కృత వర్సిటీలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తొలిమూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ పి.వెంకట్రావ్, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సీతారాంశర్మ పాల్గొన్నారు.

బీఎల్వోలకు గౌరవ వేతనాలిప్పించండి

తిరుపతి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో పనిచేస్తున్న తమకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం ఇప్పించాలని బీఎల్వోలు కోరారు. గ్రీవెన్స్‌లో ఆర్డీవోకు బీఎల్వోలు వినతిపత్రం అందజేశారు.

నేత్రపర్వం.... లక్ష దీపోత్సవం



దీపాలతో వెలుగుతున్న నారద పుష్కరిణి




ఆకాశ దీపం - దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

శ్రీకాళహస్తి, , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారద పుష్కరిణిలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా పుష్కరణి చుట్టూ నేతి దీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష హారతులు సమర్పించాక లక్షదీపోత్సవాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రిషితారెడ్డి దంపతులు దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో మొదటిసారి జరిగిన ఈ విశేష వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. దీప కాంతులతో నారదపుష్కరణి దేదీప్యమానంగా ప్రకాశించింది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు.

అంబటి, రోజాను కొండపైకి రాకుండా టీటీడీ నిషేధం విధించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, మాజీ మంత్రులైన అంబటి రాంబాబు, రోజాను తిరుమల కొండపైకి రాకుండా టీటీడీ అధికారులు నిషేధం విధించాలని టీటీడీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో రాజకీయ కార్యక్రమాలు, పార్టీ బ్యానర్లు, స్టిక్కర్లు, జెండాలు, బ్యాడ్జీలు ప్రదర్శించరాదని, నినాదాలు చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయన్నారు. అంబటి నిబంధనలకు విరుద్ధంగా మాజీ సీఎం జగన్ బ్యాడ్జీ ధరించి స్వామివారి దర్శనానికి వెళ్లడం ఆయన అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. అంబటి రాంబాబు, రోజా, విజయసాయి రెడ్డి.. తిరుమలలో రాజకీయ ప్రకటనలు చేయడం, సవాళ్లు విసరడం టీటీడీ నిబంధనలకు విరుద్ధమని, వీరిపై పదేళ్లపాటు నిషేధం విధించాలని అన్నారు. నేతలు మోహన్ రాజ్, మధుయాదవ్, షబ్బీర్ బాయ్, జైపాల్ పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు ఉత్తర్వులు వెలువరించారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన దేవప్రసాదరాజు డీఓఏ డిప్యూటీ డైరెక్టర్‌గా, శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, ఏపీఆర్‌సెట్-2024 కన్వీనర్‌గా పనిచేశారు. మూడు రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన దేవప్రసాదరాజును పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సత్కరించారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వైసీపీ: మంత్రి అనిత



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని హోంశాఖ మంత్రి అనిత విమర్శించారు. రుషికొండ ప్యాలెస్ ఎవరి కోసం నిర్మించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కపిలతీర్థంలోని శివాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో బాబు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులతో వేద ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, అధికారులు ఉన్నారు.

నేడు సబ్‌స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ నిరసనలు

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీల సర్దుబాటుకు నిరసనగా మంగళవారం జిల్లాలోని అన్ని ప్రధాన విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపడుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ సోమవారం ధ్రువీకరించారు. కార్వేటినగరం మండలం అన్నూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన నిర్వహిస్తున్నామని జీడీనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ సోమవారం తెలిపారు.




అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్, కాలువలో స్తంభించిన మురుగు

వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయండి

చిత్తూరు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి చెరువు వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో ముళ్లకంపలు పెరిగి వాకర్లకు ఇబ్బంది కలుగుతోంది. మరోవైపు తీగలు కాళ్లకు తగులుకుని కొందరు కిందపడిన సందర్భాలూ ఉన్నాయి. ఇవన్నీ ఇలా ఉంటే.. విష పురుగులూ ఈ ముళ్ల కంపల్లో చేరాయని వాకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వాకింగ్ ట్రాక్ పక్కన ఉండే కాలువలో మురుగు స్తంభించి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ఇకనైనా ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు.

సమస్యలన్నీ పరిష్కరించాలి: కమిషనర్



అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పీజీఆర్ఎస్)కు అర్జీల ద్వారా అందే సమస్యలన్నీ పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయ ఆవరణంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఇంజనీరింగ్‌కు మూడు, టీపీవోకు, మెప్మాకు ఒకటి చొప్పున అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



చిత్తూరు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో జరుగుతున్న స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో యాగశాల చతుస్థానార్చన, తిరు మాడవీధి ఊరేగింపు, పవిత్రమాల విసర్జన, తీర్థవారి మహా కుంభం సంప్రోక్షణ, శాత్తుమొర, వేదాశీర్వాదం, పూర్ణాహుతి, చక్రస్నానం తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ బృందం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరకంఠేశ్వరస్వామి ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు

నగరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో స్కందషష్ఠి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి మహరాజ అలంకారం చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. హారతి పూజలతోపపాటు స్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయదారులకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలు చేశారు. బ్రాహ్మణ సంఘం వారు బిల్వార్చన చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం పర్యవేక్షించారు.



మహరాజ అలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి

ఈ భవనాలను ప్రారంభించేదెప్పుడు?



శ్రీరంగరాజపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కటికపల్లెలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను వైసీపీ హయాంలో నిర్మించారు. సుమారు ఏడాది కిందట ఈ భవన నిర్మాణాలు పూర్తయినా ఇంత వరకు ప్రారంభించలేదు. ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి ఇకనైనా ఈ భవనాలను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే కాలువల్లా రహదారులు



చీలాపల్లెలో గుంతలమయంగా తారురోడ్డు

గుడిపాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీలాపల్లె, చవటన్‌తంగాళ్, లెప్రసీకాలనీ, సీకేపల్లె, సింగారపేట, మొగరాలపల్లె, పాపిశెట్టిపల్లె, ఎంసీఆర్ క్రాస్ రోడ్డు, పానాటూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు చిన్నపాటి వర్షానికే గుంతలమయమై కాలువలను తలపిస్తున్నాయి. దీనికితోడు ఈ గుంతల వద్దే ప్రమాదకరపు మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎ.వెంకటాపురానికి సమీపంలో రోడ్డును ఆనుకుని ఉన్న వ్యవసాయ బావి

వ్యవసాయ బావులతో పొంచి ఉన్న ప్రమాదం

గంగాధరనెల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన వ్యవసాయ బావులతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగరమంగళం పంచాయతీ ఎ.వెంకటాపురానికి సమీపంలో రహదారి పక్కన, ఎల్లాపల్లె దళితవాడకు సమీపంలో రోడ్డుపక్కన, తూగుండ్రం పంచాయతీ తొప్పన పల్లె గ్రామ బస్టాప్‌కు సమీపంలో రోడ్డుపక్కన, కలిజవేడు నుంచి నందనూరు గ్రామానికి వెళ్లేటప్పుడు రోడ్డుపక్కన, మంగినాయనికుప్పం - తిరువీధికుప్పం గ్రామానికి వెళ్లే రహదారిలో 20 అడుగుల దూరంలో రోడ్డుకు ఇరువైపులా రెండు వ్యవసాయబావులు, బుక్కాపట్నం గ్రామానికి సమీపంలో సిమెంట్‌రోడ్డు పక్కన ముళ్లకంపలు, పొదలమాటున వ్యవసాయ బావులు ఉన్నాయి. ఈ రహదారుల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వాహనదారులు రాకపోకలు సాగించేటప్పుడు ఏ మాత్రం రోడ్డు దిగినా బావుల్లో పడిపోయే ప్రమాదం ఉంది. ఈ బావుల వద్ద సేఫ్టీవాల్ నిర్మాణంతోపాటు రేడియం స్టిక్కర్లతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



మంగినాయనికుప్పం వెళ్లే దారిలో రోడ్డుపక్కన పొదలమాటున బావి

భక్తులతో శివాలయాలు కిటకిట / భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 4: నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటాయి. కార్తీక మాస తొలి సోమవారం కావడంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వర, కాశీవిశ్వేశ్వర (రాజుగుడి), కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరాలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు. మహిళా భక్తులైతే దీపారాధనలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఈవోలు తిమ్మారెడ్డి, సుబ్రమణ్యంనాయుడు పర్యవేక్షించగా, అర్చకులు శివకుమార్ గురుకల్, సిద్ధు, పార్థ, మహేష్ గురుకుల్ తదితరులు తీర్థప్రసాదాలందజేశారు.



చిత్తూరులోని అగస్థీశ్వరాలయంలో భక్తులు

ఏకాంబరేశ్వర ఆలయంలో..



యాదమరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేకపూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో..



శ్రీరంగరాజపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో పల్లేరుకాయ కోనలో ఉన్న ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూలతో అలంకరించి.. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బాలగురునాథీశ్వర ఆలయంలో..



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాలసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొమ్మరాజుపురంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తెప్పించిన పుష్పాలతో స్వామిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచల ఆలయం నుంచి విచ్చేసిన అర్చకులు మణికంఠగురుకుల్, కార్తీక్‌గురుకుల్ ఆధ్వర్యంలో ఆలయ ఎదుట తొమ్మిది కలశాలు ఏర్పాటు చేసి వారాహి, సుబ్రహ్మణ్య, రుద్ర హోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళలు పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్ రాజు, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరస్వామి ఆలయంలో..



వెదురుకుప్పం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం తొలి సోమవారం పూజలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో..

ఐరాల(కాణిపాకం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద మహిళా భక్తులు భక్తిప్రపత్తులతో విశేష పూజలు చేశారు. ఏర్పాట్లను ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు పర్యవేక్షించారు. ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరాలయంలో..



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బంగారుపాళ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వయంభుగా వెలిసిన కామాక్షి సమేత మొగిలీశ్వర ఆలయంలో కార్తీక మాసం సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. అలాగే మొగిలీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న దేవరకొండలోని జలకంఠేశ్వర స్వామికి కూడా ప్రత్యేకపూజలు చేశారు.

అద్దె భవనంలో వసతి గృహం / అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు / నూతన భవనం పునాదికే పరిమితం

విజయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయపురంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఓ అద్దె భవనంలో నడుపుతున్నారు. ఈ భవనంలో అరకొర వసతులు ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక నూతన భవన నిర్మాణానికి 2008 ఆగస్టు 9వ తేదీన అప్పటి మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో శంకుస్థాపన చేశారు. 16 ఏళ్లవుతున్నా భవన నిర్మాణం పునాది స్థాయి దాటలేదు.



అద్దెభవనంలో నిర్వహిస్తున్న వసతి గృహం

ఇనుప కమ్మీలనూ స్వాహా చేసిన వైసీపీ నాయకుడు?



పునాదికే పరిమితమైన భవన నిర్మాణం (ఫైల్ ఫొటో)

జగనన్న గృహనిర్మాణం జరుగుతున్న సమయంలో పునాదికి వేసిన ఇనుప కమ్మీలను కట్ చేసి ఓ వైసీపీ నాయకుడు సొమ్ము చేసుకున్నాడని, కొన్నింటిని సొంతింటి నిర్మాణానికి వాడుకున్నాడన్న ఆరోపణలున్నాయి. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ పునాది కాస్తా పశువుల పాకగా మారిందన్నారు. ఇకనైనా దీనిపై ఉన్నతాధికారులు విచారించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రస్తుతం పశువుల పాకగా మారిన పునాది

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



రాణికి చెక్ అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐరాల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటరమణ గత నెల 23వ తేదీన అనారోగ్యంతో మరణించాడు. ఈ క్రమంలో ఆయన భార్య రాణికి ఐడీఆర్ఎఫ్ నుంచి రూ.లక్ష చెక్కును ఎస్పీ మణికంఠ సోమవారం అందించారు. అలాగే పోలీసుశాఖ నుంచి అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

హోంమంత్రి అనితకు సన్మానం



అనితకు పుష్పగుచ్ఛమిచ్చిన ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం తిరుపతి నుంచి అనంతపురం వెళుతూ మార్గ మధ్యంలో చిత్తూరు పోలీస్ అతిథి గృహానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. అనంతరం జిల్లాలో అమలువుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమపథకాలు, లా అండ్ ఆర్డర్ ఇతరత్రా అంశాలపై అధికారులతో చర్చించారు. ఎస్పీ మణికంఠ, చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ విద్యాధరి, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణపై అవగాహన ముఖ్యమని జేసీ విద్యాధరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో కాన్‌స్టోరియమ్ ఆఫ్ హెల్త్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌క్యాన్సర్‌పై రూపొందించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. 'ఆరోగ్య బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మరింత అవగాహన పొందాలన్నారు. ఇంటర్నేషనల్ సెక్రటరీ ఇరుదుదొరై సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, ఐసీడీఎస్ పీడీ హేమావతి, అధికారులు పాల్గొన్నారు.

పెద్ద ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?

కోతకు గురైన రోడ్లతో వాహనదారుల అవస్థ



చిత్తూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోతకు గురైన రోడ్డు కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇదేదో మారు మూల ప్రాంతం అనుకుంటే పొరపాటే. సాక్షాత్తూ పోలీస్ పరేడ్ గ్రౌండ్, ఎస్పీ, జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయాలకు వెళ్లే దారిలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై ప్రశాంత్ నగర్, న్యూ ప్రశాంత్ నగర్, అనుప్పల్లె తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తుంటారు. అసలే ఇరుకైనరోడ్డు, ఆపై కోతకు గురవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

రోడ్లపైకి పిచ్చిమొక్కలు



విజయపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్లపైకి పిచ్చి మొక్కలు పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి - కనకమ్మసత్రం, చిన్నజంబాడ - నారపరాజుకండ్రిగ, ఎం.అగరం - కేవీపురం, కాళికాపురం - బుగ్గఇళ్లత్తూరు రోడ్లపైకి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, దగ్గరకు వచ్చేసరికి ప్రమాదాలు జరిగిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంబేడ్కర్ బొమ్మ తొలగింపుపై వాగ్వాదం

బైరెడ్డిపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని దాసార్లపల్లె గ్రామం లో కొందరు రాతిబండపై రూపొందించబడివున్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేడ్కర్ బొమ్మను సోమవారం రెవెన్యూ, పోలీసు అధికా రులు తొలగించడంపై వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వస్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ఎవరికీ అనుమతి లేదని అధికారులు అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం ఏర్పడింది. తహసీల్దార్ మాధవరాజు, ఎస్ఐ పరశురాముడు అంబేడ్కర్ విగ్ర హం ఏర్పాటుచేసిన వారితో మాట్లాడారు. ప్రభుత్వస్థలంలో ఏర్పాటు చేయకూడదని వారికి సూచించారు. సమస్య ఉధృతం చేయకుండా సహకరించాలని కోరారు.

చెరకు సాగుపై రైతులకు అవగాహన



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త భక్షీరామ్

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరకు సాగులో కొత్త పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమని శాస్త్రవేత్త భక్షీరామ్ తెలియజేశారు. సోమవారం కార్వేటినగరం మండలం అన్నూరులో సాగర్ షుగర్ ఫ్యాక్టరీ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండున్నర అడుగుకు దూరంగా చెరకును నాటాలని సూచించారు. క్రేన్ హెచ్‌వోడీ వరదరాజన్ మాట్లాడుతూ.. పంటల మార్పిడి విధానం కూడా అవలంబిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. క్రేన్ అధ్యక్షుడు కృష్ణన్, ఏవోలు దామోదరం, భక్తవత్సలం, సిబ్బంది హాజరయ్యారు.

సంక్షిప్తంగా..

నైపుణ్య గణనపై శిక్షణ

తవణంపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నైపుణ్య గణనపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రెడ్డిబాబు, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌకదుకాణాల్లో తనిఖీలు



యాదమరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకదుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సోమవారం విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, ఎస్ఐ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో పాచిగుంట, పత్రపల్లె, కొలనాంపల్లె గ్రామాల పరిధిలోని చౌకదుకాణాల్లో స్టాక్‌ను, రికార్డులు పరిశీలించారు.

ఘనంగా ఏక్తా దివస్

వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ ఏక్తా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద, చరిత్ర విభాగం ఉపన్యాసకుడు డాక్టర్ శివయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందీశ్వరుడి ఆలయానికి రూ.1.5లక్షల విరాళం



వెదురుకుప్పం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరుడి ఆలయానికి రూ.1.5లక్షలు విరాళంగా అందింది. సీఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన పేట రూపాజ్ఞానేంద్రరెడ్డి ఈ మొత్తాన్ని అందించారని ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు.

శకుంతలాదేవికి నివాళి

బంగారుపాళ్యం, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మానవ కంప్యూటర్‌గా పేరుపొందిన శకుంతలాదేవి జయంతిని సోమవారం టేకుమంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. గణితానికి ఆమె చేసిన సేవలను తెలియజేశారు. హెచ్ఎం వేణురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన అధికారులు



రైతుతో ఎంపీఈవో రెడ్డెప్ప

ఐరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొరుంపల్లెలో నేలకొరిగిన వరి పంటను సోమవారం అధికారులు పరిశీలించారు. ఎంపీఈవో రెడ్డెప్ప మొరుంపల్లెకొచ్చి పంటను పరిశీలించి.. రైతు ఎస్.బాలకృష్ణయ్యతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. ధాన్యం మొలకెత్తకుండా ఉండటానికి పలు సూచనలిచ్చారు.